ప్రజాశక్తి

గురువారం 27 ఫిబ్రవరి 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఏసీ కాలేజీ వద్ద పోలింగ్ సిబ్బంది





జనమయమైన కోటప్పకొండ



- రాష్ట్ర పండుగకు తరలివచ్చిన సందర్శకులు
- మూడు లక్షల మంది దర్శనం
- ప్రత్యేకతను చాటిన విద్యుత్ ప్రభలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

లక్షలాది మంది సందర్శకులు.. జిగేల్ మనిపించేలా విద్యుత్ ప్రభలు.. దేదీప్యమానంగా ఆలయం.. వెరసి రాష్ట్ర పండుగైన కోటప్పకొండ తిరునాళ్ల సందడి సందడిగా కోలాహలంగా సాగింది. భారీ ప్రభలతో రైతులు, యువకులు పగ్గాలు పట్టి, కొండదారిన తరలివచ్చారు. రూ.లక్షల వ్యయంతో నిర్మించిన భారీ విద్యుత్ ప్రభల వెలుగు కోటప్పకొండ తిరునాళ్ళకు మరింత శోభనిచ్చాయి. శ్రీత్రికోటేశ్వర స్వామి ఆలయంతో పాటు త్రికూటాచలం విద్యుత్ దీపాలంకరణతో వెలుగొందింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు 2లో

పట్టభద్రుల నిర్ణయం నేడు

- మొత్తం ఓటర్లు : 3,47,116
- పోలింగ్ కేంద్రాలు : 483
- 1444 బ్యాలెట్ బాక్సులతో సామగ్రి తరలింపు
- 24 ఫ్లయింగ్ స్కాడ్‌లు - భారీ బందోబస్తు
- దూరప్రాంత ఓటర్లకు టిడిపి రవాణా సదుపాయం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం జరగనున్న పోలింగ్‌లో 3,47,116 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 206456 మంది ఉండగా మహిళలు 140615 మంది, ఇతరులు 45 మంది ఉన్నారు. ఎన్నికలకు సంబంధించి మొత్తం 483 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం ఆరు జిల్లాల పరిధిలో 33 నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. ఆరు జిల్లాల కలెక్టర్లు జిల్లా ఎన్నికల అధికారులుగా వ్యవహరించనుండగా ఆరు జిల్లాల డిఆర్‌వోలు కూడా సహాయ రిటర్నింగ్ అధికారులుగా పనిచేస్తారు. మొత్తం ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి వ్యవహరిస్తున్నారు. 2లో

నేడు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు

విద్యాసంస్థలకు సెలవు ప్రకటించిన గుంటూరు, పల్నాడు జిల్లాల అధికారులు - 8 లో



విద్యుత్ తీగలపై డ్రోన్.. పేలిన ట్రాన్స్‌ఫారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



కోటప్పకొండ తిరునాళ్ల సందర్భంగా శాంతిభద్రతలు పర్యవేక్షణ కోసం పోలీసులు ఉపయోగించిన డ్రోన్‌లో సాంకేతిక సమస్య ఏర్పడింది. సిగ్నల్ నిలిచిపోవడంతో కొండపై దేవస్థానం సమీపంలో ఉన్న అల్పాహారశాల పైగా వెళుతున్న విద్యుత్ తీగల్లో చిక్కుకుంది. విద్యుత్ తీగలపై డ్రోన్ పడటంతో ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పెద్ద శబ్దం రావడంతో ఒక క్షణం పాటు ఏం జరిగిందో తెలియక అల్పాహారశాలలో ఉన్న సందర్శకులు బయటకు పరుగులు తీశారు. సమీపంలోని వారు సైతం భయభ్రాంతులకు గురయ్యారు. ప్రమాద సమయంలో ఘటనా స్థలంలో ఉన్న ఎస్‌పి కె.శ్రీనివాసరావు, అదనపు ఎస్‌పి జెవి సంతోష్ స్పందించి సిబ్బందిని అప్రమత్తం చేసి సందర్శకులకు భద్రత కల్పించారు. అల్పాహారశాలను మూసివేయించడంతో పాటు సహాకయ చర్యలను పర్యవేక్షించారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రశాంతంగా దర్శనం చేసుకోవచ్చని మైక్ ద్వారా సూచించడంతో అందరూ తేరుకున్నారు. కాగా తిరునాళ్ల నేపథ్యంలో కొండ పైన, కింద మొత్తం 15 డ్రోన్ కెమెరాలతో నిఘా, 3 వేల మంది పోలీసులు, 300 సిసి కెమెరాలు, 50 మంది క్రైమ్ పార్టీ పోలీసులను బందోబస్తుకు ఏర్పాటు చేశారు.

శైవక్షేత్రాల కిటకిట

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తాడేపల్లిలోని కృష్ణానది వద్ద సందర్శకులు..



మహాశివరాత్రి సందర్భంగా సందర్శకుల రాకతో ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. కోటప్పకొండ, అమరావతి, పెదకాకాని, గోవాడ, క్వారీ, సత్రశాల, ధైద తదితర శైవక్షేత్రాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు వరకు రద్దీ కొనసాగింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, తెలంగాణ జిల్లాల నుంచి కోటప్పకొండకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. లక్షలాదిగా తరలి వచ్చిన సందర్శకులతో కోటప్పకొండ కిక్కిరిసింది. కొండ కింద భాగంలో విద్యుత్ ప్రభలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. పల్నాడు జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి టిడిపి, వైసిపి నాయకులు ఈ ప్రభలను ప్రారంభించారు. ప్రభల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఆలరించాయి. సందర్శకుల కోసం జిల్లా వ్యాప్తంగా ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడిపింది. పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్‌పి కె.శ్రీనివాసరావు కోటప్పకొండ వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. అమరావతి, ధైద, సత్రశాల, గోవాడ, పెదకాకాని, క్వారీ తదితర శైవక్షేత్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. క్యూలైన్ల వద్ద రద్దీని నియంత్రించడానికి ఆలయాల వద్ద లఘుదర్శనం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి కోటప్పకొండకు భారీగా యాత్రికులు రావడం వల్ల మధ్యాహ్నం నుంచి వివిధ మార్గాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు రద్దీ కొనసాగింది. గుంటూరు-నర్సరావుపేట, చిలకలూరిపేట - నర్సరావుపేట- వినుకొండ తదితర మార్గాల్లో రద్దీ ఎక్కువై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. కొండపై నుంచి కిందకిదిగే వరకు ఎక్కడ చూసినా యాత్రికుల కోలా హలం కనిపించింది.



పండగ రోజు విషాదం

- ట్రాక్టర్‌ను ఢీకొట్టి ద్విచక్ర వాహనం
- ఇద్దరు విద్యార్థులు దుర్మరణం

తమ బిడ్డ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు

వార్త మెయిన్ పేజీలో

కోడ్ అమలులో ఉన్నా

జోరుగా మద్యం అమ్మకాలు

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం నియోజకవర్గంలో బుధవారం మద్యం విక్రయాలు జోరుగా సాగాయి. బాటిల్ పై 50 నుండి 100 రూపాయలు అదనంగా వసూలు చేశారు. ఎందుకంటే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో షాపులు మూసివేయడంతో బెల్ట్ షాపుల్లో జోరుగా అమ్మకాలు సాగుతున్నాయి. ఈ షాపులకు మద్యం ఎక్కడ నుంచి వస్తుందనేది ఎక్సైజ్ అధికారులు, వైన్ షాపుల యజమానులు చెప్పాలని మహిళలు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గంలో 23 వరకు మద్యం దుకాణాలు ఉన్నాయి. పోలీస్ స్టేషన్లలో అధికారులు, ఇబ్బంది శివాలయాల్లో బందోబస్తు డ్యూటీలకు వెళ్లిపోయారు. ఇక బెల్ట్ షాపుల నిర్వాహకులు తెగబడ్డారు. విచ్చలవిడిగా మద్యం అమ్ముకొని జేబులు నింపుకుంటున్నారు. కొంతమంది వ్యక్తులు ముందుగానే స్టాక్ పెట్టుకొని దర్జాగా అమ్ముకుం టున్నారని తెలుస్తుంది. దీని వెనుక షాపుల్లో పనిచేసే ఉద్యోగుల పాత్ర ఉందని అంటున్నారు. ఎంఎల్సి ఎన్నికలు సందర్భం గా మంగళవారం సాయంత్రం మద్యం దుకాణాలకు సీలు వేశారు. కానీ మూసివేసిన మద్యం దుకాణాల్లో సరుకు జోరుగా బెల్ట్ షాపులకు చేరింది. కొత్త కొత్త తరహాలో బెల్ట్ షాపులు నడుపుతున్నారు.

'రంగా' అనుమతి ఉంటే ఇబ్బంది లేదా..?

నియోజకవర్గంలో బెల్ట్‌షాపులు నిర్వహించాలి అంటే రంగా అనుమతి తప్పని సరి చెప్తు న్నారు. తనకు ఇవ్వాల్సిన మమ్ములు ఇచ్చి నువ్వు ఎప్పుడు ఐనా? ఎక్కడ ఐనా అక్రమంగా మద్యం బెల్ట్ అమ్ముకోవచ్చు అన్న మాట వినిపిస్తుంది. అసలు ఎవరు ఈ రంగుల రంగా ?ఎందుకు ఈయనకి అంత పవర్ ? ఎక్సైజ్ శాఖలో ఇతనికి అంత బలం ఎక్కడిదనే చర్చ సాగుతోంది. అధికారులకు తెలిసే ఈ తతగం జరుగుతుందనే విమర్శ ఉంది. విచిత్రం ఏమంటే షాపులకు దగ్గరలో బెల్ట్ షాపులు పెట్టి మందు అమ్మడం ఒక తంతు అయితే, ఫోన్ నెంబర్లు ఇచ్చి వారికి ఫోన్ చేయండి మందు మీ దగ్గరకే వస్తుంది అని కొంతమంది చెప్పి వ్యాపారం చేయడం మరొక తంతుగా సాగుతోంది. ఈజీగా డబ్బు సంపాదించుకోవాలనుకున్న వ్యక్తులు ఈ మద్యం విక్రయాలను సాగిస్తున్నారని చెప్పాలి.




అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్

ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వ రమ్మ ఆధ్వర్యంలో మచిలీపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధ వారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడుల్లో భాగంగా మచిలీపట్నం వైఎస్ఆర్ కాలనీలోని ముస్తాఖాన్ పేటలో కాసుల పద్మ వద్ద నుంచి మొత్తం 43 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఆమెపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఉయ్యూరు

ఉయ్యూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బుధవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నలుగురిని అరెస్టుచేసి వారి వద్ద నుంచి 42 మద్యం సీసాలు స్వాధీన పరుచుకున్నట్లు సీఐ సీహెచ్ శేషగిరిరావు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా డ్రై డే అమలులో ఉన్నందున స్టేషన్ పరిధిలో దాడులు జరిపి మద్యం విక్రయిస్తున్న నలుగురిని అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు. ఎస్సై కళ్యాణి, ఎన్ఫోర్స్ మెంట్ విజయవాడ ఎస్సై రామశేషయ్య, ఈఎస్టీ మచిలీపట్నం ఎస్సై సంతోశ్, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు. లైసెన్స్ లేకుండా మద్యం విక్రయించడం నేరమని, అటువంటి నేరాలకు పాల్పడేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.



జనమయమైన కోటప్పకొండ

(మొదటి పేజీ తరువాయి)

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్‌పి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అధికార యంత్రాగం పెద్దఎత్తున ఏర్పాటు చేసింది. బుధవారం తెల్లవారుజాము నుండే కొండకు సందర్శకుల తాకిడి పెరిగింది. 3 లక్షల మందికి పైగా శ్రీ త్రికోటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పించేందుకు పల్నాడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం పనిచేసింది. శాంతిభద్రలను ఎస్పీ కె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

స్వామి వారికి పట్టువస్త్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరుపున దేవాదాయ శాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి బహూకరించారు. ఎమ్మెల్యే అరవిందబాబు, పాలకమండలి ఛైర్మన్ వంశపారంపర్య ధర్మకర్త రామకృష్ణ, కొండలరావు బహదూర్, ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి టిజి భరత్, ప్రభుత్వ చీఫ్‌విప్ అయిన వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ఉన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సామాన్యులతో పాటు కొండ దిగువ నుండి ఆర్టీసీ బస్‌లో కొండపైకి చేరుకొని క్యూలైన్లో ఉండి దర్శనం చేసుకున్నారు. దర్శనం కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉచిత, శీఘ్ర, ప్రత్యేక దర్శనాలతో పాటు విఐపీల క్యూలైన్లలోనూ రద్దీ కనిపించింది. విఐపిల తాకిడితో పాటు విచ్చలవిడిగా విఐపి పాస్లు జారీ చేయడంతో సాధారణ సందర్శకుల కంటే వీరి రద్దీ ఎక్కువై ఇతరులు అసహనానికి గురయ్యారు.

తెల్లరుజాము నుండే ఎమ్మెల్యే అరవింద బాబు కొండ పైకి చేరుకొని వైద్య శిబిరం, తాగునీటి సౌకర్యం, మజ్జిగ, బిస్కెట్ పంపిణీ, అన్న ప్రసాదాలు అందించడం వంటి వాటిని పర్యవేక్షించారు. సందర్శకులతో స్వయంగా మాట్లాడి ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. టీమ్ చదలవాడ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేశారు. కొండపైన వివిధ భక్త సమాజాలు, సేవాసంస్థల ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ, తాగునీరు అందజేశారు. కొండకు వెళ్లే మెట్ల మార్గంలో రద్దీ కనిపించింది. ప్రభుత్వ పథకాలను వివరించే స్టాల్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ప్రారంభించి తిలకించారు. కోటప్పకొండ తిరునాళ్ల సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఫొటో ఎగ్జిబిషన్‌ను కలెక్టర్‌తోపాటు ఇతర అధికారులు, సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. వ్యాపార దుకాణాలు, బొమ్మల దుకాణాలు రద్దీగా కనిపించాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎక్కడికక్కడ పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో కొండ పైకి వెళ్లేందుకు ప్రత్యేక బస్‌లు ఏర్పాటు చేశారు. నరసరావుపేట ఆర్టీసీ డిపో నుండి 234 బస్సులు ఏర్పాటు చేయగా గుంటూరు, చిలకలూరిపేట, వినుకొండ, సత్తెనపల్లి నుండి 300కు పైగా బస్సులు ఏర్పాటు చేశారు. విఐపి బస్‌లు పైకి వెళ్లేందుకు కొంత ఆలస్యం కావడంతో సాదారణ జనం కొంత అసహనానికి గురయ్యారు.

చిన్నా, పెద్దల కేరింతలతో కోటప్పకొండ కోలాహలంగా ఉంది. కాళింది మడుగు వద్ద, ఉద్యానవనంలో పక్షుల కేంద్రాన్ని, ఎక్వేరియం తదితర వాటన్నింటిని సందర్శకులు తిలకించారు. పర్యాటక కేంద్రం వద్ద రద్దీ ఏర్పడింది. కొండకు భారీగా తరలివచ్చిన ప్రభలు కోటప్పకొండకు మహాశివరాత్రిని పురస్కరించుకొని భారీ విద్యుత్ ప్రభలు 22 , మొక్కుబడి ప్రభలు 80 వరకు తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన మొక్కుబడి ప్రభలు భారీ విద్యుత్ ప్రభలు పోలీసులు సూచించిన సమయానికి కొండకు చేరుకున్నాయి. చిన్నారులు చిట్టి ప్రభలతో నడుచుకుంటూ కొండకు చేరుకున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట ప్రాంతాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు, సాధారణ ప్రభలు కొండకు తరలివచ్చాయి. విద్యుత్ ప్రభల వద్ద ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



దర్శనానికి ఎమ్మెల్యే అరవిందబాబుతో కలిసి వస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, టిజి భరత్, జీవీ ఆంజనేయులు, ఆయన భార్య







స్టాళ్లను ప్రారంభిస్తున్న పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు





కోటప్పకొండపై సందర్శకులు.. కొండపైకి బస్సులో వెళ్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

పట్టభద్రుల నిర్ణయం నేడు



(మొదటి పేజీ తరువాయి)

మొత్తం 21మంది నోడల్ అధికారులను నియమించారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలుకు పర్యవేక్షణ బృందాలను, 24 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఎన్నికలకు పోలీసు అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

ఈ ఎన్నికలకు 1444 బ్యాలెట్ బాక్సులు ద్వారా పోలింగ్ మెటీరియల్‌ను గుంటూరు, నరసరావుపేట, విజయవాడ, మచిలీపట్నం, నూజివీడు కేంద్రాల నుంచి సంబంధిత సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని తీసుకువెళ్లారు. ఏలూరు జిల్లా నూజివీడు, కైకలూరుకు నూజివీడు నుంచి సామగ్రిని తరలించారు. ఓట్ల లెక్కింపు 3న గుంటూరు ఏసీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా ఓటర్లను చేర్పించడంలో ముందజలో ఉన్న టిడిపి నాయకులు ఇతర ప్రాంతాల నుంచి జిల్లాలకు ఓటర్లను తీసుకురావడంలో రవాణా సదుపాయాలు కల్పిస్తున్నారు. కర్నాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి ఎక్కువ మంది ఓటర్లు రానున్నారు.

పట్టభద్రుల తీర్పు ఎటు?

ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ టిడిపి కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, పిడిఎఫ్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ అయిన కె.ఎస్.లక్ష్మణరావు మధ్య నెలకొంది. నువ్వా, నేనా అన్నట్టుగా పోటీ జరుగుతోంది. రాజకీయంగా ఇద్దరికి సుదీర్ఘ అనుభవం ఉంది. 14 ఏళ్ల పాటు ఎమ్మెల్సీగా పనిచేసిన పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లతో పాటు రైతులు, కౌలురైతు సంఘాలు, గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు, ఇతర ప్రజా సంఘాల నుంచి విశేష మద్దతు లభిస్తోంది. అధ్యాపకుడిగా పట్టభద్రులతో నేరుగా ప్రజా సంబంధాలు మెండుగా ఉండటం లక్ష్మణరావుకు కలిసొస్తోంది. ఆలపాటికి టిడిపి కార్యకర్తలు, నాయకులు, అధికార పార్టీ ఎమ్మెల్యేల ప్రచారంతో పాటు అంగబలం, అర్థబలం మెండుగా ఉన్నాయి. కూటమి ప్రభుత్వంపై నెలకొన్న అసంతృప్తి లక్ష్మణరావుకు సానుకూలంగా మారే అవకాశంలేకపోలేదు. అంతేగాక ఆలపాటిపై విజయవాడ, గుంటూరులో వచ్చిన అక్రమ భూ లావాదేవీల ఆరోపణలు కూడా అధికార పార్టీ అభ్యర్థికి ప్రతికూలంగా మారాయి. అధికార పార్టీలోనే ఆలపాటి అభ్యర్థిత్వంపై అసంతృప్తి ఉంది.

శైవ క్షేత్రాలు కిటకిట



శ్రీ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న శాసనసభ్యులు



శ్రీ మల్లేశ్వరస్వామిని దర్శించుకున్న ప్రముఖులు



శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసిన భక్తులు

ప్రజాశక్తి - పెదకాకాని

ప్రముఖ శైవక్షేత్రాలలో ఒకటైన పెదకాకానిలోని శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానము మహాశివరాత్రి పర్వదిన మున భక్తుల శివనామస్మరణతో మారుమ్రోగింది. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండ ప్రత్యేక టెంట్లు,క్యూలైన్లు, త్రాగునీరు, పారిశుధ్యం, భోజన ఏర్పాట్లు పై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వేకువ జాము నుండే సుదూర ప్రాంతాల నుండి భక్తులు విచ్చేసి స్వామివారిని అమ్మవారిని దర్శించుకున్నారు. స్వామి వారిని హైకోర్టు జడ్జీలు, వివిధ శాఖల అధికారులు దర్శించుకున్నారు ఈ సందర్భంగ ఆలయ ఉపకమిషనర్ గోగినేని లీలా కుమార్ మాట్లాడుతూ శివరాత్రి పర్వదినం పురస్కరించుకొని భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు అన్న ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలలో దేవస్థానం నుండే కాక పలు సేవ సంస్థలు పాల్గొన్నాయన్నారు. లింగోద్భవకాలమున స్వామి వారికి ఏకాథ ద్రవ్యాలతో రుద్రాభిషేకము, గజ వాహనంపై ఎదుర్కోలోత్సవము తెల్లవారుజామున శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారి కళ్యాణము అత్యంత వైభవోపేతముగా జరుగునని ఆలయ పున: నిర్మాణ దాతలు శ్రీ కొల్లిపర వంశీకులు వారిచే అమ్మ వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారనీ, ప్రముఖ కళ్యాణ వ్యాఖ్యాత శ్రీపుల్లా భట్ల వెంకటేశ్వర్లు కళ్యాణ వ్యాఖానము చేస్తారనీ లీలాకుమార్ తెలిపారు. శివరాత్రి పర్వదినమున మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకున్న వారిలో స్థానిక శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమర్, పెద్ద కూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్‌కుమార్, గౌరవ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ గుణరంజన్, జస్టిస్ హరి హర నాథ్‌శర్మ వేరు వేరుగా శ్రీ స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఆలయ అర్చకస్వాములు, వేదపండితులు వేదఆశ్వీరవచనము చేయగా ఆలయ అధికారులు, స్వామి వారి శేష వస్త్రముతో సత్కరించి చిత్రపటము, ప్రసాదము అందజేసినారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, ప్రముఖులు శ్రీ స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

పోలింగుకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి మంగళగిరి

ఈనెల 27వ తేదీన జరిగే కృష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి ఎమ్మెల్సీ ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు మంగళగిరిలో రెండు పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పూర్తి చేశారు. మంగళగిరి రూరల్ గ్రామాల పరిధిలోని ఎమ్మెల్సీ ఓటర్లు మంగళగిరి పట్టణంలోని సి కె హైస్కూల్, జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఐదు కేంద్రాలలో ఓటర్లు ఓటు వేసేందుకు ఏర్పాట్లను పూర్తి చేశారు. మంగళగిరి పట్టణానికి చెందిన ఓటర్లు పట్టణంలో గల విటిజేయం డిగ్రీ కళాశాలలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశారు. క్యూలైన్‌లు, టెంట్లు, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. మొత్తంగా మంగళగిరి పట్టణంలో 66 మంది సిబ్బందిని పోలింగ్ బూతులు వద్ద ఏర్పాటు చేశారు

విద్యుత్ ప్రభలతో ధగధగలాడిన వడ్లమూడి క్వారీ



విద్యుత్ కాంతితో ఊరేగింపుగా వస్తున్న ప్రభలు




కాలినడకతో తరలి వస్తున్న భక్తుడు

ప్రజాశక్తి చేబ్రోలు

బుధవారం వడ్లమూడి క్వారీ తిరునాళ్ల శివ నామస్మరణతో మారుమ్రోగింది. విద్యుత్ ప్రభల కాంతులతో ఆ ప్రాంతమంతా ధగధగలాడుతూ మెరిసిపోయింది. ప్రభల నిర్వాహకులు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరిం చాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రభల నిర్వహక కమిటీలను పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ప్రతి ఏడాది కంటే ఈ ఏడాది భారీ సంఖ్యలో భక్తులు క్వారీ తిరణాలకు విచ్చేశారు. బుధవారం వేకువ జాము నుండి భక్తులతో క్యూ లైన్లు కిక్కిరిసి పోయాయి. నిత్యాభిషేక నీలకంఠునికి పంచామృతాలతో అభిషేకం జరిపించి, శివానుగ్రహం పొందేందుకు భక్తులు క్యూ కట్టారు. ప్రజలు కుటుంబ సమేతంగా తరలివచ్చి, శ్రీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, పూజ క్రతువుల అనంతరం లింగ రూపంలో ఉన్న పరమశివుని దర్శించారు. ఎటు చూసినా జన సందోహమే. ఏకకంఠంతో వడ్లమూడి క్వారీ మహాశివరాత్రి తిరునాళ్లలో మారుమోగిన శివన్నామస్మరణ. ఉదయం నుండి వచ్చిన జనాల అంచనా ప్రకారం ఈ సంవత్సరం తిరునాళ్లకు లక్ష మంది పైనే సందర్శించే అవకాశం ఉందని ఆలయ కమిటీ కార్యదర్శి అధికారులు చెబు తున్నారు. మండలంలో మొత్తం పదికి పైగా భారీ విద్యుత్ ప్రభలు, మరో ఐదారు విద్యుత్ చిన్న తడిక ప్రభలు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. నాలుగు ప్రభలు దేవస్థానం దగ్గర సిట్టింగ్లో ఏర్పాటు చేయగా, మిగిలిన ప్రభలు గ్రామాల్లో సిద్ధం చేసి ఊరేగింపుగా బాల కోటేశ్వర స్వామిని చేరుకోవడం జరిగింది. నారాకోడూరులో మూడు భారీ విద్యుత్ ప్రభలతో ప్రతి సంవత్స రం రాత్రంతా గ్రామంలో ఊరేగింపుతోనే సమయం గడిచిపోతుంది. మరుసటి రోజు తెల్లవారిన తర్వాత ఆలయానికి చేరు కోవడం జరుగుతుంది. డబ్బును అధికముగా వెచ్చించి ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ ప్రభలు ఈ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలి చాయి. వీటితోపాటు చుట్టు ప్రక్కల గ్రామాల నుండి చిన్న ప్రభలు కుటుంబాల వారీగా ఆ పరమేశ్వరుని అనుగ్రహం కొరకు భక్తి శ్రద్ధలతో బుధవారం ఉదయం నుండి ఎండను కూడా లెక్కచేయకుండా కాలినడకతో కోడెలు, పొట్టేళ్ళను తరలించుకుని బాల కోటేశ్వర స్వామిని చేరుకున్న ప్రభలు అనేకం. శివరాత్రి సందర్భంగా చేబ్రోలు మండలంలోని గొడవర్రు, గుండవరం, నారాకోడూరు, సుద్దపల్లి, చేబ్రోలు, వడ్లమూడి, శలపాడు గ్రామాలలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలను సందర్శించిన స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్. ప్రభల ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులు గ్రామ ప్రజలు ప్రభల దగ్గర ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలు స్వీకరించి ప్రజలకు మహా శివ రాత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. భారీ విద్యుత్ ప్రభలు నిర్వాహకులకు, ప్రభుత్వ అధికారులు పోలీసులు తగిన సూచనలు చేశారు. ప్రభల ఎత్తు, సామర్థ్యాన్ని దృష్టిలో ఉంచుకొని దేవస్థానానికి ప్రభలు తరలించే విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గతంలో జరిగిన విద్యుత్ ప్రభల ప్రమాదాలు బారిన పడకుండా, అప్రమత్తంగా ఉండి ఎలాంటి ఆటంకాలు, ఇబ్బందులు కలగకుండా అధికారులు పర్యవేక్షించారు.



తిరునాళ్లకు పొట్టేళ్లను తరలిస్తున్న భక్తులు



తిరునాళ్లకు తరలిన ప్రభ



నాదెండ్ల మనోహర్‌కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకుతున్న కమిటీ సభ్యులు

శివరాత్రి పూజల్లో మంత్రి మనోహర్

ప్రజాశక్తి తెనాలి

మహాశివరాత్రి సందర్భంగా శివాలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజామున 5 గంటల నుంచి ఆలయాలలో పూజా కార్యక్రమాలు మొదలయ్యాయి. పట్టణంలోని మారీస్‌పేట శివాలయంలో, రూరల్ పరిధిలోని సంఘం జాగర్లమూడి సంగమేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సంగమేశ్వర స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ మంత్రిని ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఈ సందర్భంగా మనోహర్ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఇది ఇలా ఉంటే క్వారీ తిరునాళ్లకు, గోవాడ తిరునాళ్లకు ఆర్టిసి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ప్రతి ఐదు నిమిషాలకు ఓ బస్సు వెళ్లేలా ప్రయాణికులకు సమకూర్చింది. తెనాలి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తిరునాళ్లకు విశేషంగా తరలి వెళ్ళారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు ప్రతిష్టమైన బందోబస్తు నిర్వహించారు.



మొక్కజొన్న రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మొక్కజొన్నను ఆశిస్తున్న కత్తెర పురుగు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాగాణి భూములలో పంట నూర్పిడి అనంతరం రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఆశిస్తున్న కారణంగా నివారణకు రైతులు సమగ్ర యాజమాన్య చర్యలు జాగ్రత్తలు తీసుకోవాలని నరసరావుపేట మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్ర బాబు అన్నారు. నరసరావుపేట మండలంలో ఇటీవల నిర్వహించిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మొక్కజొన్న పొలాలను పరిశీలించగా కత్తెర పురుగు ఉధృతిని గమనించామన్నారు. కత్తెర పురుగు ఆశిస్తే పంట ఎదుగుదల నశించి దిగుబడి పూర్తిగా తగ్గిపోయి రైతు నష్టపోయే అవకాశం ఉందని ఆయన అన్నారు. మంచు విపరీతంగా కురవడం, పంట ఏపుగా పెరగడం వల్ల ఆకులపై రాత్రి వేళల్లో కత్తెర పురుగులు ఆశించి ఆకులను కత్తిరించిన మాదిరిగా తినేస్తున్నాయని తెలిపారు. కత్తెర పురుగులు మొవ్వును అడ్డ దిడ్డంగా తినేస్తాయని, దీని నివారణకు ఎమామెక్టిన్ బెంజాయిట్ మందును పిచికారీ చేయాలని సూచించారు. మొక్కజొన్న తెగుళ్ల నివారణకు ఆకులు ఎర్రబారితే మల్టీకే ఎకరాకు కిలో 200 లీటర్ల నీటికి కలిపి ద్రావణాన్ని పిచికారీ చేస్తే చేనులో నీరును తట్టుకుని చేను ఏపుగా పెరుగుతుందన్నారు.





సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది

ప్రజాశక్తి-ఈపూరు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు మండల కేంద్రమైన ఈపూరులోని జెడ్‌పి పాఠశాల పోలింగ్ కేంద్రానికి సిబ్బంది, పోలీసులు సామగ్రితో చేరుకున్నారు. మండలంలో 979 మంది ఓటర్లు ఉండగా ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులను ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై ఎం.ఉమామహేశ్వరరావు తెలిపారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట

గురువారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం చిలకలూరిపేట నియోజకవర్గంలో 13 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 8718 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. చిలకలూరిపేట పట్టణంలోని ఆర్‌విఎస్‌సివిఎస్ హైస్కూల్‌లో 7 పోలింగ్ బూత్‌లు ఉండగా ఇక్కడ 4753 మంది ఓటేయనున్నారు. చిలకలూరిపేట రూరల్ ప్రాంతాల వారికి శారదా పాఠశాలలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇక్కడ 1298 మంది ఓటేయాల్సి ఉంది. యడ్లపాడు మండలంలో ఎల్‌హెచ్ పాఠశాలలో రెండు బూత్‌లలో 1077 మంది, నాదెండ్లలో జెడ్‌పి పాఠశాలలలోరి రెండు బూత్‌లలో 1590 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ప్రజాశక్తి పెదకూరపాడు

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లన్నీ చేశామని తహశీల్దార్ ఎన్.ధనలక్ష్మి తెలిపారు. పెదకూరపాడులోని జెడ్‌పి పాఠశాలలో రెండు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఓటర్ల కోసం హెల్ప్‌డెస్క్ కూడా ఏర్పాటు చేశామన్నారు. వైద్య సదుపాయాలు కూడా అందుబాటులో ఉంచామన్నారు.







రాష్ట్ర పండుగైన కోటప్పకొండ తిరునాళ్లకు తరలివచ్చిన సందర్శకులు, ప్రభలు.. రాత్రి వేళ విద్యుత్ ప్రభల వెలుగులు





శైవక్షేత్రాలు కిటకిట

ప్రజాశక్తి - అమరావతి

మహాశివరాత్రి సందర్భంగా స్థానిక అమరేశ్వర ఆలయానికి రెండు తెలుగు రాష్ట్రాల నుండి సందర్శకులు భారీగా తరలివిచ్చారు. తెల్లవారుజామున మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఐదు గంటల నుండి దర్శనానికి క్యూలైన్లలో బారులుదీరారు. సందర్శకులకు అసౌకర్యాలు తలెత్తకుండా దేవాదాయ శాఖ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్రావు, స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ప్రజా ప్రతినిధులు, హైకోర్టు న్యాయమూర్తులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు సందర్శించారు. ఏర్పాట్లు, కార్యక్రమాలను ఆలయ అధికారి సునీల్ కుమార్ పర్యవేక్షించారు.



ప్రజాశక్తి- రెంటచింతల

శివనామ స్మరణతో మార్మోగిన సత్రశాల

పల్నాడు ప్రాంతంలో ప్రముఖ శైవ క్షేత్రం కృష్ణానది ఒడ్డున గల సత్రశాల సందర్శకులతో కిక్కిరిసింది. మల్లికార్జున స్వామి దర్శనం కోసం క్యూలో బారులుదీరారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి దంపతులకు, శిల్పారామం చైర్మన్ మంజులారెడ్డి దంపతులు ఆలయాన్ని సందర్శించారు. పలు సామాజిక తరగతులకు చెందిన వారు సందర్శకుల కోసం భోజనం ఏర్పాటు చేశారు. చిన్న చిన్న ప్రభలు, విద్యుత్తు ప్రభలతో ప్రాంగణమంతా ప్రత్యేక ఆకర్షణగా కనిపించింది. ట్రాఫిక్ నియంత్రణకు పోలీస్ సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఏర్పాట్లు, కార్యక్రమాలను ఆలయ ఈవో రామిరెడ్డి, ఎంపీడీవో సరోజినీ దేవి పర్యవేక్షించారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని శివాలయాలు బుధవారం కిక్కిరిశాయి. పలు గ్రామాల నుండి భారీగా కోటప్పకొండకు తరలివెళ్లారు. సత్తెనపల్లి నుండి బయలుదేరిన ప్రభలు తెల్లవారుజామున ముప్పాళ్ల మండలంలోని పలు గ్రామాల నుండి వెళ్తున్న క్రమంలో పలువురు నమస్కరించారు. ప్రభలను ఉంచిన బడ్లను లాగుతున్న ఎడ్లను, కోడె దూడలను చూడడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపడంతో ఆయా మార్గాల్లో కోలాహలం నెలకొంది.



బ్రిటీష్ వారికి పన్నులు ఎగ్గొట్టించిన ధీరుడు కన్నెగంటి

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కన్నెగంటి హనుమంతు 103వ వర్ధంతి - ఘన నివాళి

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

పల్నాడు ప్రజలచే బ్రిటీష్ ప్రభుత్వానికి పన్నులు ఎగ్గొట్టించిన ధీరుడు కన్నెగంటి హనుమంతు అని వాసవి క్లబ్ జోన్ ఛైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. పుల్లరి ఉద్యమ నేత స్వర్గీయ కన్నెగంటి హనుమంతు 103వ వర్ధంతిని వాసవి క్లబ్ మాచర్ల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్లోని కన్నెగంటి హనుమంతు విగ్రహానికి క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోన్ ఛైర్మన్ చెన్నకేశవరావు మాట్లాడుతూ బ్రిటీష్ వారిని ముప్పతిప్పలు పెట్టి, ముచ్చుమటలు పట్టించిన చరిత్ర హనుమంతుదని తెలిపారు. ఆనాడు జరిగిన భారత స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా కన్నెగంటి హనుమంతు ఆధ్వర్యంలో పలు గ్రామాల ప్రజలు పన్నులు చెల్లించకుండా, ప్రభుత్వ అధికారులను బహిష్కరించి, వారిపై దాడులకు దిగారన్నారు. అధికారులకు తినటానికి తిండి, తాగటానికి తాగునీరు దొరకకుండా చేశారని చెప్పారు. దాంతో ఆగ్రహించిన బ్రిటీష్ దొరలు 1922 ఫిబ్రవరి 26న మించాలపాడు పై విరుచుకుపడి కన్నెగంటి హనుమంతును చుట్టుముట్టి కాల్చి చంపారని, 26 తుపాకీ గుండ్లు శరీరాన్ని తూట్లు పొడిచినా వందేమాతరం అని నినాదాలు చేస్తూ ప్రాణాలు విడిచిన దేశభక్తుడు కన్నెగంటి అని కొనియాడారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో పల్నాటి పౌరషాన్ని చూపి ప్రాణ త్యాగం చేసిన కన్నెగంటి హనుమంతు చరిత్ర నేటి తరాలకు ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో తిరివీధి వెంకటనాగేశ్వరరావు, బచ్చు సుబ్బారావు, మేడం నాగేశ్వరరావు, ముప్పవరపు నాగార్జున, పావులూరి సతీష్‌బాబు పాల్గొన్నారు.



పోటెత్తిన కృష్ణా తీరం

కిటకిటలాడిన శివాలయాలు

ప్రజాశక్తి- తాడేపల్లి

మహాశివరాత్రి సందర్భంగా బుధవారం సీతానగరం వైపు కృష్ణా తీరం పోటెత్తింది. తెల్లవారుజాము నుంచి యాత్రికులు స్నానమాచరించడానికి కృష్ణా నది వైపు తరలివచ్చారు. కనకదుర్గ దత్తత దేవస్థానమైన శ్రీమద్ వీరాంజనేయ కోదండ రామాలయంతోపాటు శివాలయాలు యాత్రికులరాకతో కళకళలాడాయి. జీయర్ ఆశ్రమంతోపాటు ఇంద్రకీలాద్రికి యాత్రికుల తాకిడి తాకింది. వివిధ స్వచ్ఛంద సంస్థలు యాత్రికులకు ఆహారంతో పాటు మంచినీరు కూడా సరఫరా చేశాయి. యాత్రికులకు అసౌకర్యం కలగకుండా మున్సిపల్ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకోవడానికి వీలుగా ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.



మరోవైపు అధికారులు ఏర్పాటు చేసిన ఘాట్‌లో కాక.. అనధికారికంగా కృష్ణా నదిలో ఎక్కడికక్కడ యాత్రికులు స్నానాలు ఆచరించారు. పోలీసులు ప్రమాదమని హెచ్చరిస్తున్నా పెడచెవిన పెట్టారు. కనకదుర్గమ్మ వారధి దిగువన కృష్ణా నదిలో గల భవాని జల శంకర దేవాలయానికి కూడా యాత్రికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పోలీసుల విస్తృత బందోబస్తు

శివరాత్రి సందర్భంగా సీతానగరం వైపు కృష్ణా నదిలో తాడేపల్లి సీఐ బత్తుల కళ్యాణ రాజు ఆధ్వర్యంలో విస్తృత బందోబస్తు నిర్వహించారు. ఇద్దరు ఎస్సైలతోపాటు 20 మంది పోలీసులు ఆ ప్రాంతంలో నిరంతరం గస్తీ నిర్వహించారు. గజ ఈతగాలను సిద్ధం చేశారు. దేవాలయాల దగ్గర ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా నిఘా నేత్రాలు ఏర్పాటు చేయడంతోపాటు పోలీసులు అందుబాటులో ఉండేలా తగు చర్యలు తీసుకున్నారు. నదిలో బోటు ద్వారా ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా సీఐ కళ్యాణ్ రాజు పర్యటించి యాత్రికులు మన్ననలు పొందారు.



యాత్రికులకు ప్రసాదాల పంపిణీ

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక భగీరథ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి యాత్రికులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు మాట్లాడుతూ.. ట్రస్ట్ తరపున 30 సంవత్సరాల నుంచి నిరంతరాయంగా ప్రసాదాలు పంపిణీ చేస్తున్నామన్నారు. దాతలు సహకారం లేకుండా తమ ట్రస్టులోని 15 మంది సభ్యుల సొంత నగదుతో ప్రసాదాల పంపిణీ బాధ్యత తీసుకున్నట్లు చెప్పారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో జిడుగు వెంకట నారాయణ, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బోగి కోటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల కోటేశ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారాయణ, కగ్గా శ్రీనివాసరావు, జూట్రు ఏడుకొండలు, కటారి విష్ణుమూర్తి, పంచల శివ, మారం మల్లికార్జునరావు, పెరుమాళ్ల శివ, నంద్యాల గోపాలకృష్ణ పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆసుపత్రికి అడుగులు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలో బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ సెంటర్ నిర్మాణానికి త్వరలో అడుగులు పడనున్నాయి. ఆసుపత్రి నిర్మాణానికి అడ్డుగా ఉన్న హెచ్‌టి విద్యుత్ టవర్లు, లైన్ల తొలగింపు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ముమ్మరమయ్యాయి. ఆసుపత్రి నిర్మాణానికి కేటాయించిన స్థలానికి వెలుపల ఉండేలా హెచ్‌టీ విద్యుత్ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరుకు సమీపంలో ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం 15 ఎకరాలు కేటాయించింది. ఫేజ్-1లో 300 పడకలతో ఆసుపత్రి నిర్మించాలని ప్రణాళికలు రూపొందించారు. ఆసుపత్రి నిర్మాణానికి 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు భూమిపూజ చేశారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆసుపత్రి నిర్మాణం ఊసే లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, అమరావతి నిర్మాణానికి ప్రాధాన్యత నివ్వడంతో మళ్లీ ఈ అంశం ముందుకొచ్చింది. ఎమ్మెల్యే, బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి చైర్మన్ నందమూరి బాలకృష్ణ ఇటీవల ఆసుపత్రికి కేటాయించిన స్థలాన్ని సిఆర్‌డిఎ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆ ప్రాంతంలో హెచ్‌టి విద్యుత్ లైన్లు అడ్డుగా ఉండటంతో వాటిని తొలగించాలని సిఆర్‌డిఎ అధికారులను కోరారు. హెచ్‌టి లైన్లు తొలగిస్తే ఆసుపత్రి నిర్మాణ పనులు మొదలు పెట్టేందుకు అవకాశం ఉంటుందని బాలకృష్ణ చెప్పడంతో సిఆర్‌డిఎ అధికారులు ట్రాన్స్‌కోకు లేఖ రాశారు. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి కేటాయించిన స్థలంలో హెచ్‌టీ లైన్ల తొలగింపు పనులు రెండు నెలల క్రితం మొదలయ్యాయి. ఆసుపత్రి నిర్మాణానికి అడ్డుగా ఉన్న విద్యుత్ టవర్లు, హెచ్‌టీ లైన్లను తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. పశ్చిమ బంగ్లాకు చెందిన కొంతమంది కార్మికులు పనిలో నిమగ్నమయ్యారు. రాజధాని నిర్మాణ పనులు త్వరలో మొదలు కానున్నట్లు ప్రభుత్వం చెబుతోంది.



విద్యుత్తు టవర్ల పనుల్లో కార్మికులు

చెంచుపేట రైతు బజారులో సమస్యల బేజారు

రోడ్డుపైనే వాహనాలు నిలుపుదల

పోటీగా ప్రైవేటు వ్యక్తుల కూరగాయల విక్రయం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలోని చెంచుపేట రైతు బజార్ వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతు బజార్‌కు ఆనుకునే ప్రైవేట్ వ్యక్తులు కూరగాయల వ్యాపారం నిర్వహించడం ఒక కారణమైతే.. తెనాలి-గుంటూరు మార్గంలో విపరీతమైన రద్దీకి భయపడి మార్కెట్లో కూరగాయల కొనుగోలుకు వినియోగదారులు మొగ్గు చూపకపోవడం మరో కారణం. పైగా ఈ రోడ్డు నాలుగు లైన్ల మార్గంగా విస్తరణకు ప్రతిపాదనలు ఉన్న నేపథ్యంలో రైతు బజార్‌ను అమరావతి ప్లాట్స్ లో ఖాళీగా ఉన్న ఉడా స్థలంలోకి మారిస్తే ప్రయోజనం ఉంటుందని స్థానికులు అంటున్నారు.




అమరావతి ప్లాట్స్‌లో ఖాళీగా ఉన్న ఉడా స్థలం



చెంచుపేట రైతుబజారు

రైతులు పండించిన పంటలను నేరుగా విక్రయించుకునేందుకు వీలుగా ప్రభుత్వం పట్టణంలోని పలు ప్రాంతాలలో రైతు బజార్లను ఏర్పాటు చేసింది. దానిలో భాగంగా తెనాలి-గుంటూరు రోడ్డు మార్గంలో చెంచుపేట శబరి వద్ధాశ్రమం వద్ద రైతు బజార్‌ను ఏర్పాటు చేసింది. అక్కడ కూరగాయలు విక్రయించుకునేందుకు ఎంపిక చేసిన రైతులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ దుకాణాలను ఆనుకుని ప్రైవేట్ వ్యక్తులు కూడా కూరగాయల వ్యాపారం నిర్వహిస్తున్నారు. వారిని నియంత్రించడంలో అధికారులు చొరవ చూపడం లేదు. వ్యాపారులు కూడా వారిపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు కొందరు చెబుతున్నారు. ఫిర్యాదు చేసినా అధికారుల నుంచి స్పందన కరువు అవ్వడంతో తీవ్రంగా నష్టపోతున్నట్లు వారు వాపోతున్నారు. దీనికి తోడు ఈ మార్గంలో వాహనాల రాకపోకల తీవ్రత అధికం. రైతు బజారుకు వచ్చే వినియోగదారుల వాహనాలు ముందు పార్క్ చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. కొన్నిసార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా లేకపోలేదు. పైగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చొరవతో ఈ రోడ్డు నాలుగు లైన్లుగా విస్తరణకు టెండర్లు కూడా ఖరారు అయ్యాయి. ఈ నేపథ్యంలో చెంచుపేట అమరావతి ప్లాట్స్‌లో రైతు బజారును ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అమరావతి ప్లాట్స్‌లో ఉడా కార్యాలయం ప్రాంగణం ఖాళీగా పనికి రాని మొక్కలు మొలిచి వృథాగా ఉన్నాయి. ప్లాట్లు కేటాయింపు సమయంలో ప్రజావసరాల కోసం కొన్నిచోట్ల స్థలాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతు బజార్ ను అమరావతి ప్లాట్స్ లోకి తరలిస్తే ఒకవైపు రైతులకు దళారుల నుంచి కొంత పోటీ తగ్గుతుంది. మరోవైపు ట్రాఫిక్ అంతరాయం లేకుండా ఉంటుందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు ప్రజావసరాలను పరిగణనలోకి తీసుకొని పరిశీలించాలని, మరోవైపు రైతులు సమస్యలను, స్థానికుల డిమాండ్లను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



మొన్న పేరు ఉంది.. నేడు లేదు!

- ఓటరు జాబితాలో సిత్రాలు

ప్రజాశక్తి- తాడేపల్లి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు జాబితాలో అధికారులు చిత్రవిచిత్రాలకు తెరతీశారు. నెల రోజుల క్రితం జిల్లా ప్రిసైడింగ్ అధికారి తాడేపల్లి పట్టణంలో ఓటరు జాబితాలో అందరికీ అందుబాటులో ఉంచారు. బూత్ నంబరు 281, వరుస నంబరు 51లో గుండుబోయిన అంజిరెడ్డి తండ్రి సుబ్బారెడ్డి, తాడేపల్లి, బోసు బొమ్మ సెంటర్, డోర్ నెంబర్ 1-107లో ఓటరుగా నమోదయి ఉంది. రెండు రోజుల క్రితం ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి తుది జాబితా పేరుతో మరలా జాబితా అందజేశారు. అందులో పైన పేర్కొన్న గుండుబోయిన అంజిరెడ్డి పేరు దగ్గర, ఫొటో మీద డిలీట్ అని ముద్ర వేసి ఉంది. ఇది చూసి ఆశ్చర్యపోవడం ఓటరు వంతైంది. ఓటమి భయం పట్టుకున్న అధికార పార్టీ అభ్యర్థి ఇటువంటి జిమ్మిక్కులకు పాల్పడుతున్నారని పట్టభద్రులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరో ఒకరి ఐడెంటిటీ కార్డు తీసుకొచ్చి.. దొంగ ఓట్లు వేయడానికి కూడా అధికార పార్టీ ప్రయత్నాలు చేస్తున్నట్లు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

పఠాన్ జైనబ్ ఖాన్‌కు మంత్రి అభినందనలు

ప్రజాశక్తి-మంగళగిరి

పెయింటింగ్ లో భిన్నమైన శైలితో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం సంపాదించిన మంగళగిరికి చెందిన పఠాన్ జైనబ్ ఖాన్ బుధవారం రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ను ఉండవల్లి లోని నివాసంలో కలిశారు. ఆమె 7 గంటలపాటు శ్రమించి, 318 విస్తరాకులను ఒకటిగా చేసి సర్దార్ భగత్ సింగ్ చిత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గానికి చెందిన జైనబ్ ఖాన్ ఈ రికార్డు సాధించడం గర్వంగా ఉందని అన్నారు. ఈ మేరకు ఆమెను అభినందించారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు హశీష్..

ప్రజాశక్తి- తాడేపల్లి

తైవాన్‌లో చైనీస్ తైపీ రోలర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మార్చి 24 నుంచి 30 వరకు జరిగే అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఇండియా నుంచి తాడేపల్లి డోలాస్ నగర్‌కు చెందిన మెరుగుపాల హశీష్ ఎంపికయ్యాడు. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్షులు లీయు పు- త్సాయ్ నుంచి ఆహ్వానం అందింది. హశిష్ ఆర్టిస్ట్ స్కేటింగ్ విభాగంలో ఫ్రీ స్టైల్, ఇన్ లైన్, సోలో డాన్స్ పోటీలలో తలపడతాడు. హశిష్ గత ఏడాది డిసెంబర్లో తమిళనాడు పొలాచిలో రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో బంగారు పతకం సాధించారు. ఆ అర్హతతోనే తైవాన్ లో జరగనున్న అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా క్రీడాకారుడు హశిష్ ఎంపికపై కోచ్ సత్యనారాయణ, చిట్టిబాబు ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి థామస్, గుంటూరు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నీలిమ, పి.శ్రీకాంత్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.





శ్రీ చైతన్య టెక్నోలో ఫ్యామిలీ బ్లూమ్స్

ప్రజాశక్తి- మాచర్ల

పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో ఫ్యామిలీ బ్లూమ్స్ పేరిట స్మార్ట్ లివింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అయ్యపరెడ్డి హరణి మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు తల్లి, తండ్రి, గురువులతో ఎలా ఉండాలి, మెలగాలి, గౌరవించాలి అనే విషయాలు విద్యార్థులకు వివరించారు. పాఠశాల స్థాయి నుంచే మానవత్వం, నైతిక విలువలు అలవర్చుకుని కుటుంబం, సమాజం పట్ల ఎలా వ్యవహరించాలో విపులంగా వివరించారు. అనంతరం విద్యార్థులు వారి తల్లిదండ్రులకు వివిధ రకాల బహుమతులు అందజేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ అనీల్, సి-బ్యాచ్ ఇన్‌చార్జి శివ, హారిక, రాజ్యలక్ష్మి, మానస తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ..

ఏరులై పారుతున్న మద్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి ప్రకారం రెండు రోజుల పాటు మద్యం అమ్మకాలు నిలిపివేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులు మంగళవారం రాత్రి అన్ని మద్యం (వైన్స్ , బార్ రెస్టారెంట్) దుకాణాలకు సీల్ వేశారు. అయితేనేం ఇది మద్యం దుకాణదారులకు వరంగా మారిందనే చెప్పాలి. దుకాణం సీలు వేసింది వేసినట్లు ఉన్నప్పటికీ దొడ్డి దారిన యథావిధిగా అమ్మకాలు సాగించారు. మధ్యవర్తుల ద్వారా 180 ఎం.ఎల్ మద్యం సీసాకు రూ.50 నుంచి రూ.100ల వరకు విక్రయించి అధిక లాభాలను పంచుకున్నారు. సాధారణ సమయంలో దుకాణాలలో అమ్మకాలు జరిగితే ఇటువంటి సమయంలో మద్యం వ్యాపారం రోడ్డు మీదకు వచ్చింది. ప్రధానంగా నరసరావుపేటలో వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్ లకు సమీపంలో ఆయా దుకాణాలకు సంబంధించిన వ్యక్తులు ద్విచక్ర వాహనం, సంచులలో పెట్టుకుని జోరుగా విక్రయాలు సాగించారు. దుకాణాలకు వేసిన సీలు అలాగే ఉండటం.. జోరుగా మద్యం అమ్మకాలు సాగడం వెనుక చూస్తే సంబంధిత శాఖ అధికారుల పని తీరుపై విమర్శలు వెలువెత్తుతున్నాయి. దీనిపై ఆ శాఖ ఉన్నతాధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. నరసరావుపేట పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న వైన్ షాపుల నుంచి కూడా బెల్ట్ షాపులకు మద్యం అధిక మొత్తంలో గొలుసు వ్యాపారులు తరలించి అధిక ధరలకు విక్రయాలు జరిపారు. పేరుకే ఎన్నికల పేరిట నిబంధనలని.. క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావని పలువురు విమర్శిస్తున్నారు.

కిటకిటలాడిన శివాలయాలు

ప్రజాశక్తి- మాచర్ల

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని పలు శైవాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు తలస్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలు ధరించి ఆలయాలకు చేరుకున్నారు. పట్టణంలోని రామప్పగుడి, నగరేశ్వరస్వామి, వీరభద్ర, ఇష్టకామేశ్వరస్వామి, బుగ్గమల్లేశ్వర, నాగబుద్ధ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామికి ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, పూజలు కొనసాగాయి. పలు ఆలయాల్లో పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. రాత్రంతా భక్తులు భక్తిశ్రద్ధలతో శివజాగరణ చేశారు. భజనలు, భక్తి పాటలు, గాన కచేరీలు చేపట్టారు. ఆయా దేవాలయ కమిటీలు భక్తులకు అన్నదానం, తీర్థప్రసాదాలు అందించారు.

ఈపూరు : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని భద్రుపాలెం గ్రామ సమీప సంజీవకొండ, మండల కేంద్రం ఈపూరు గ్రామంలోని వీరభద్రస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంజీవ కొండపై ఎస్ఐ ఎం.ఉమామహేశ్వరరావు, పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. సంజీవ కొండ, వీరభద్ర స్వామి ఆలయాల వద్ద గ్రామస్తులు భారీ అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్తులకు మహా అన్నదానం

మాచర్ల : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రింగ్ రోడ్డు 22వ వార్డు శివాలయంలో టిడిపి నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, మాచర్ల టిడిపి అధ్యక్షులు కొమెరా దుర్గారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మహాఅన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 2 వేలకు మందికి పైగా భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మద్దిగపు వెంకట రామిరెడ్డి, కొమెర అంతరములు, కొమెర శివ, ఓర్చు క్రాంతి, లాలా కృష్ణ, ఉప్పుతోళ్ల దుర్గారావు, బత్తుల కుమార్, కొమెర శ్రీను, చల్లా హరి, తిరుమల కొండ జమలయ్య, దేరంగుల దాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ఎమ్మెల్యే కన్నా పూజలు

సత్తెనపల్లి రూరల్ : మహాశివరాత్రి సందర్భంగా సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అచ్చంపేట రోడ్డులో ఉన్న శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



భక్తులకు అన్నదానం



మల్లయ్య స్వామికి పూజలు

ఘనంగా ధన మల్లయ్య స్వామి తిరునాళ్ల వేడుక

కారంపూడి : మండలంలోని ఒప్పిచర్ల గ్రామ శివారున నల్లమల అడవిలో వెలసి శ్రీ ధన మల్లయ్య స్వామి తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు గోలి విశ్వనాథం ఆధ్వర్యంలో నిత్య పూజలు జరిపారు. వేలాది మంది భక్తులు ధన మల్లయ్య స్వామివారిని సన్నిధికి చేరుకుని, సంప్రదాయానుసారం పూజలు చేపట్టారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సత్తెనపల్లి టౌన్ : శివరాత్రి పర్వదినం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పురాతన చరిత్ర కలిగిన శివాలయాలను అత్యంత వైభవగా అలంకరించారు. భక్తులు భారీ సంఖ్యలో హాజరై స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణానికి చెందిన ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి దళంకాళ్ల ప్రభుదాస్ నాణేళ్లతో తయారు చేసిన శివలింగం అందరినీ అకట్టుకుంది.



తిరునాళ్లకు తరలివెళ్తున్న సందర్శకులు



అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కన్నా



రామప్పగుడిలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



బందోబస్తు విధుల్లో పోలీసులు

సామాన్యులపై పన్నుల బాదుడు!

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఏళ్ల తరబడి ప్రభుత్వ రంగ సంస్థలు ఇంటి, ఖాళీ స్థలాలు, మంచినీటి కుళాయిల పన్నులు రూ.లక్షల్లో బకాయిలు పేరుకుపోయినా.. ఆయా కార్యాలయాలకు పన్నులు చెల్లించాలని ఒత్తిళ్లు చేయరు. ఎటువంటి నోటీసులూ ఇవ్వరు. అదే పేదలు నివసించే ప్రాంతాలు, మురికివాడల్లో... పనులేక ఇల్లు గడవని స్థితిలో ఇంటి, మంచి నీటి కుళాయి పన్నులు చెల్లించపోతే వడ్డీకి వడ్డీతో పాటుగా ముక్కుపిండి మరీ వసూలు చేస్తుంటారు. నోటీసులు పంపి.. అసలు, పెనాల్టీ ఖర్చులే కాక కోర్టు ఖర్చులు రూ.500 కట్టాలని నోటీసులు ఇప్పిస్తున్నారు. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాలు 36 వరకు ఉన్నాయి. ఈ కార్యాలయాలలకు సంబంధించి ఇప్పటి వరకు మున్సిపాలిటీ వారికి చెల్లించాల్సిన భవన, నీటి పన్నులు పెనాల్టీలతో కలుపుకొని రూ.2 కోట్ల 19 లక్షల రూపాయల వరకూ ఉందని అంచనా. ప్రయివేట్ ఆస్తులు ఇంటి, మంచి నీటి కుళాయిల పన్నులు కలిపి ఆయా యజమానులు మున్సిపాలిటికి చెల్లించాల్సిన పన్నులు రూ.12 కోట్లా57 లక్షల వరకు ఉందని తెలుస్తోంది. ఇందులో రూ.6 కోట్ల 08 లక్షల వరకు ఈ నెలలో చెల్లించారని.. ఇంకా రూ.6 కోట్ల 48 లక్షలు వసూలు కావాల్సి వస్తుందని పట్టణ మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. నీటి పన్నులు కాకుండా ఇంటి పన్నులకు మాత్రమే మొదటి ఏప్రిల్ నుంచి జూన్ వరకు పెనాల్టీ ఉండదని.. జులై నెల నుంచి నెలకు 2 శాతం వడ్డీ చొప్పున వసూలు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీ హరిబాబు చెబుతున్నారు. మున్సిపల్ పన్నులు సకాలంలో చెల్లించాలని.. లేకుంటే ఏప్రిల్ నుంచి 3 నెలలు అంటే జూన్ వరకు పెనాల్టీ ఉందని, ఆ తరువాత ప్రతి నెలకూ నూటికి 2 శాతం వడ్డీ పడుతుందన్నారు. ఉదాహరణకు ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ నెల దాకా వరుసగా కట్టకపోతే 3 నెలలు పోను మిగిలిన 3 నెలలకు 2 శాతం చొప్పున 6శాతం కట్టాల్సి వస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థలకు కూడా పెనాల్టీలు వేస్తామని అధికారులు చెబుతున్నారు. స్థానిక నెహ్రూ నగర్‌కు చెందిన మందా చిన రామయ్యకు మున్సిపాలిటీ కి చెందిన స్టాండింగ్ కౌన్సిల్ ఇటీవల కోర్టు నోటీసు పంపింది. మొత్తం సుమారు రూ.20 వేల వరకు వివిధ పన్నులు మార్చి నెలాఖరులోపు కట్టవలసినదిగా నోటీసు పంపి ఉన్నారు. కరోనా దెబ్బకు అల్లకల్లోలమై కుటుంబ పోషణ కష్టంగా ఉన్న ఈ పరిస్థితుల్లో ఇంత మొత్తం ఒకేసారి చెల్లించాల్సి రావడం కష్టమేనని ఆయన వాపోతున్నాడు.

రైతుకూ గుర్తింపు కార్డు..

- **సేవలు, పథకాలు పొందాలంటే.. ఆధార్ తరహా నంబరు**
- **తప్పనిసరి అంటున్న వ్యవసాయాధికారులు**

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దేశంలో ప్రతి పౌరుడికీ ఆధార్ కార్డు గుర్తింపు ఇచ్చినట్లుగా.. ప్రతి రైతుకూ 11 అంకెలు కలిగిన యూనిక్ ఐడీ నంబరుతో కూడిన ప్రత్యేక గుర్తింపు కార్డులను అందించేందుకు కేంద్రం ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సాగు భూమి ఉన్న ప్రతి రైతుకూ ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య పత్రం జారీ పక్రియ జిల్లాలో ప్రారంభమైంది. ఇందుకు సంబంధించి జిల్లాలో రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతోంది. జిల్లాలో మొత్తం 4.04 లక్షల మంది రైతులు ఉన్నారు. వీరిలో 50 శాతం మందికిపైగా పీఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందుతున్నారు. ఇప్పటికే 1.12 లక్షల మందికి యూనిక్ కోడ్ గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఫిబ్రవరి నెల చివరి నాటికి 30 శాతం రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రక్రియ జరుగుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. రైతులకు ఈ ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పథకాలను పారదర్శకంగా అందుబాటులోకి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు.

నమోదుకు అవసరమైన ధ్రువపత్రాలు...

రైతు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, వన్‌బీ, ఆధార్ కార్డు లింక్ అయిన మొబైల్ నెంబరును రైతు సేవా కేంద్రానికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. రైతు మొబైల్ నంబరుకు మూడు ఓటీపీలు వస్తాయి. ఆ ఓటీపీలను వ్యవ సాయ సిబ్బందికి తెలియచేస్తే రైతు యూనిక్ ఐడి దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. ఆధార్ మాదిరిగా యూనిక్ కోడ్ తో జారీ చేసే ఈ కార్డులతో రైతులకు ఐడీ కార్డుగా ఉపయోగపడుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే అన్ని పథకాలను రైతుల యూనిక్ కోడ్‌తో అనుసంధానం చేస్తారు. రానున్న రోజుల్లో ఈ యూనిక్ నెంబర్ ఉన్న రైతులకు వ్యవసాయ పథకాలు, ఎరువులు, పంటల బీమా అందుతాయని అధికారులు అంటున్నారు. ఈ యూనిక్ నెంబర్‌ను ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింక్‌తో కూడిన సేవలు పొందవచ్చు. దేశంలో ఎక్కడి నుంచైనా రైతుల రుణ అర్హత, రుణ బకాయిలు, ప్రభుత్వ పథకాలు వివరాలను సులభంగా తెలుసుకోవచ్చు. దీంతోపాటు పంటలకు కనీస మద్దతు ధర పొందేందుకు ఈ కార్డులు దోహదం చేస్తాయి. వీటితో పాటు ఇతర సేవలైన నీటి పారుదల, తెగుళ్ల నియంత్రణ, వాతావరణ సూచనలు వంటి సేవలు కూడా పొందేందుకు వీలవుతుంది.

ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి..



కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫార్మర్ యూనిక్ ఐడీని ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకొని పొందాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పలు పథకాలు ఈ ఐడీ కార్డు ద్వారా పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటికే జిల్లాలో రైతు సేవా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది.

- ఐ.మురళి,
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

మంగళగిరిలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం : మంత్రి లోకేష్

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి చినకాకాని వద్ద ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న వంద పడకల ఆసుపత్రిని దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో ఆసుపత్రి భవన నమూనాపై అధికారులతో బుధవారం మంత్రి సమీక్షించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా భవన నమూనాను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ.. మంగళగిరి ప్రజల 30 ఏళ్ల కల వంద పడకల ఆసుపత్రి. అత్యాధునిక వసతులతో వంద పడకల ఆసుపత్రిని తీర్చిదిద్దాలి. వంద పడకల విభాగంలో దేశానికి రోల్ మోడల్‌గా ఆసుపత్రి నిలవాలి. ప్రశాంత వాతావరణంలో వైద్యులు పని చేసేలా ఉండాలన్నారు. రోగులకు అత్యుత్తమ వైద్యం అందించేలా ఆసుపత్రిని తీర్చిదిద్దాలి అని చెప్పారు. ఆసుపత్రిలో వైద్య సేవలు పొందేందుకు ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. డాక్టర్లు, పేషంట్లు, విజిటర్స్ కోణంలో జోన్లు రూపొందించాలని అధికారులకు సూచించారు. పేరెన్నికగన్న ఆసుపత్రుల భవన నమూనాలను పరిశీలించి అందుకనుగుణంగా మార్పులు, చేర్పులు చేయాలన్నారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు. పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాను రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఎమ్ఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ వైద్య విద్య, మౌలిక సదుపాయాల అభివద్ధి సంస్థ) సీఈ జి.సుధాకర్ రెడ్డి, ఎస్ఈ వి.చిట్టిబాబు, ఈఈ సీవీ రమణ, భార్గవ్ గ్రూప్ చీఫ్ ఆర్కిటెక్చర్ నిఖిల, ఏపీఎమ్ఎస్ఐడీసీ డీఈఈ ఎమ్. హనుమంతరావు నాయక్, ఏఈ జి.గోపీచంద్, ఏఈ కె.శివ సత్యనారాయణ, భార్గవ్ గ్రూప్ డీజీఎమ్ ఏ.శ్యామ్ కిషోర్, సీనియర్ ఇంజనీర్ డి.అనిల్ కుమార్ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్



ప్రసాదాలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు

శివాలయంలో పూజలు

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిగాయి. దేవాలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. పలువురు భక్తులు, ధార్మిక సంస్థలు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ బోగికోటేశ్వరరావు, వాకా మంగారావు, మాజీ ధర్మకర్త కొల్లి వెంకట బాబురావు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో జేవీ నారాయణ పర్యవేక్షించారు. భక్తులు మారం మల్లికార్జునరావు అండ్ ఫ్రెండ్స్‌సర్కిల్ ఆధ్వర్యంలో సుమారు రూ.50వేలు వ్యయంతో పులిహోర, రవ్వ కేసరి, శనగ గుగ్గిళ్ళు ప్రసాదాలు పంపిణీ చేశారు.



వెండి నామాలు బహుకరిస్తున్న యాత్రికులు

త్రిలోకాధిపతికి వెండి నామాలు బహూకరణ

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి నగరంలో రెండు వైష్ణవ దివ్యక్షేత్రాల నడుమ ఉన్న శ్రీ గంగాభ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలోని శివుని విగ్రహానికి అలంకరించే నిమిత్తం మంగళగిరికి చెందిన విడేల సాయి శ్రీనివాస్, హారిక దంపతులు మూడవ కన్నుతో కలిగిన వెండి నామాలను బహూకరించారు. ఈ మేరకు బుధవారం వెండి నామాలు ఆలయ ఈవో జే.వి.నారాయణకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూర్వ చైర్మన్ బోగికోటేశ్వరరావు, ఆలయ అర్చకులు తెలిదేవరపల్లి శ్యామసుందర శాస్త్రి, సీతారామ కోవెల మాజీ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వాకా మంగారావు పాల్గొన్నారు.



త్రికోటేశ్వరుని సన్నిధానంలో మంత్రి భరత్

త్రికోటేశ్వరున్ని దర్శించుకున్న మంత్రి భరత్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టిజి. భరత్ బుధవారం శ్రీత్రికోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుణాళ్ల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలిగించకుండా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ చక్కగా పర్యవేక్షించారని చెప్పారు.

అలరించిన జడ్పీ హైస్కూల్ విద్యార్థుల చిత్రలేఖన ప్రదర్శన



ఆకట్టుకున్న విద్యార్థులు గీసిన వర్ణ చిత్రాలు

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆరు నుంచి పదవ తరగతి విద్యార్థులు పలు రకాల అంశాలపై గీసిన వర్ణ చిత్రాలు చూపరులను అలరించాయి. బుధవారం మహాశివరాత్రి సందర్భంగా, మంగళవారం జిల్లా పరిషత్ హైస్కూల్లో డ్రాయింగ్ ఎగ్జిబిషన్ ఉపాధ్యాయులు సిహెచ్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 50 మంది విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను చిత్రలేఖనం ద్వారా కనబరిచారు. అపురూపంగా వేసిన చిత్రాలను ఉపాధ్యాయులు ప్రదర్శన నిమిత్తం పాఠశాలలో ఉంచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు అభినందించారు.

నెక్కల్లు పోలేరమ్మ దేవస్థానంలో నగలు అపహరణ



పోలేరమ్మ తల్లి దేవస్థానం



గుడి గేటు తాళాన్ని కోసిన దుండగులు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని నెక్కల్లు గ్రామంలోని పోలేరమ్మ దేవ స్థానంలో దొంగతనం జరిగింది. పోలే రమ్మ విగ్రహానికి ఉన్న వెండి వడ్డాణం, కిరీటం, హుండీలో డబ్బు, కానుకలు అపహరణకు గురయ్యాయి. వీటి విలువ రూ 2లక్షల వరకు ఉంటుందని అంచనా. గుడిలో ఉన్న సిసి కెమెరాలను పగుల గొట్టి వైర్లు కత్తిరించి రికార్డింగ్ బాక్స్‌లను ఎత్తుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత దొంగతనం జరిగినట్లు భావిస్తున్నారు. గుడి ఊరికి దూరంగా ఉండడంతో అదే అదునుగా భావించి దొంగతనానికి పాల్పడి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. గుడి పూజారి గుమ్మా గంగయ్య, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం..రోజు మాదిరిగానే పూజా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం బుధవారం ఉద యం పూజారి గంగయ్య దేవస్థానానికి వచ్చారు. గుడి గేటుకు, హుండీకి ఉన్న తాళం కోసివేయబడి ఉండడం, పోలేరమ్మ విగ్రహంపై నగలు కనబడక పోవడంతో గ్రామ స్తుల కు సమాచారం అందించారు. దీంతో గ్రామ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుడులే లక్ష్యంగా ..

నెక్కల్లులోని పోలేరమ్మ దేవస్థానంలో 2003, 06వ సంవత్సరంలో దొంగతనాలు జరిగాయి. మంగళవారం జరిగిన మూడవది. ఇప్పటి వరకు నిందితులను పట్టుకున్న దాఖలాలు లేవు. నెక్కల్లుకు పక్కనే 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనంతవరంలోని వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో కూడా వరుస దొంగతనాలు జరిగాయి. పోలీసులు కేసులు నమోదు చేయడం మినహా ఇప్పటి వరకు దొంగలను పట్టుకున్న దాఖలాలు లేవు. పోలీసులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తులతో కిక్కిరిసిన పేరేచర్ల కైలాసగిరి కొండ

ప్రజాశక్తి - మేడికొండూరు

మహాశివరాత్రి వేడుకను పురస్కరించుకుని మండలంలోని పేరేచర్ల కైలాసగిరి కొండపైన శివాలయం భక్తులతో కిక్కిరిసింది. బుధవారం కొండపైన ప్రత్యేక పండుగ పూజలు జరిగాయి. గుంటూరుకు అతి దగ్గరగా ఉండటంతో పేరేచర్ల కైలాసగిరికి వేలాది మంది యాత్రికులు తరలి వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మేడికొండూరు సిఐఎస్కే నాగూర్ మీరా సాహెబ్ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ఇండస్ట్రీ జాగ్రత్తగా భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాన్ని డాక్టర్ నిరుద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.



కైలాసగిరి కొండపైకి చేరుకున్న భక్తులు



దీక్షల్లో కూర్చున్న కార్మికులు

85వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు బుధవారం నాటికి 85వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎస్.కె.మాలిన్, ఎస్.కె నూర్జహాన్, ఎస్.కె కైరునిషా, వి.రిబ్కా, బి.సామ్రాజ్యం కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల సమస్యను పరిష్కరించి ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని కోరారు. యాజమాన్యంతో, కార్మికులతో, కార్మిక నాయకులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, ఎస్.కె ఇస్మాయిల్, ఎం పుష్పరాజు, ఈ విశాలాంధ్ర, సిహెచ్ పిచ్చయ్య, బి.అంకయ్య, ఎస్.కె.కాశీం, ఎస్.కె.బాషా, వై.సుబ్బారావు, ఎం.గురవయ్య, ఈ చారమ్మ పాల్గొన్నారు.



పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ఆత్మీయులు


వల్లభనేని పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- తాడేపల్లి

టిడిపి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు పుట్టిన రోజు వేడుకలు బుధవారం తాడేపల్లి పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయి. ముందుగా కేక్ కట్ చేసి వెంకట్రావుకు అభినందనలు తెలిపారు. బాణసంచా కాల్చారు. పలువురు స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో దొంతిరెడ్డి సాంబిరెడ్డి, గొర్లవేణుగోపాల్ రెడ్డి, అద్దంకి మురళి, మేక పుల్లారెడ్డి, వేణుగోపాలరావు, పెంచలయ్య, తురక దుర్గారావు, సుమలత, మాజీ కౌన్సిలర్ కే నిర్మల పాల్గొన్నారు.

చిన్న రంగా షరీఫ్‌కు మాతృ వియోగం

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్



షేక్ జహ్రాబి (ఫైల్)

ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ షేక్ చిన రంగా షరీఫ్ మాతృమూర్తి షేక్ జహ్రాబి (79) మంగళవారం రాత్రి వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆమెకు కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె రెండవ కుమారుడు అయిన షేక్ చినరంగా షరీఫ్ వడ్డేశ్వరం గ్రామానికి సర్పంచిగా పనిచేసే సేవలందించారు. జహారాభి మృతి వార్త తెలుసుకున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు బుధవారం వడ్డేశ్వరం గ్రామంలోని జహ్రాబి భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, సిపిఎం సీనియర్ నాయకులు షేక్ శిలార్ష, కాంగ్రెస్ పార్టీ మంగళగిరి నియోజకవర్గ నాయకులు షేక్ సలీం, వైఎస్ఆర్సిపి ఎంటిఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, వైఎస్ఆర్సిపి మండల నాయకులు మున్నంగి వివేకానంద రెడ్డి, టిడిపి వడ్డేశ్వరం గ్రామ అధ్యక్షులు ఈపూరి బాబు, టిడిపి సీనియర్ నాయకులు షేక్ కాలేషా, కాట్రగడ్డ మధుసూదనరావు, వైఎస్ఆర్సిపి తాడేపల్లి మండల నాయకులు కత్తిక రాఘవరావు, గొడవర్తి శ్రీనివాసరావు, కత్తిక మల్లికార్జునరావు, తెలుగు యువత నాయకులు షేక్‌నాగూర్‌వలి పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవు

ప్రైవేటు సంస్థల్లోని ఉద్యోగులకు ఓటు వేసేందుకు వెసులుబాటు

ప్రజాశక్తి-గుంటూరు



ఉమ్మడి కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా నేడు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లోని ఓటు హక్కు ఉన్న ఉద్యోగులు ఓటు వినియోగించు కునేందుకు ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం అవకాశం కల్పించాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్క ఓటరు తన ఓటును వినియోగిం చుకోవటాన్ని నిరోధించ కుండా ఉండేందుకు పోలింగ్ రోజు అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలలోని ఉద్యోగస్తులలో అర్హత కల్గిన ఓటర్లు ఉంటే వారు ప్రత్యేక సాధారణ సెలవును వినియోగించుకోవటానికి అనుమతి ఇవ్వాలన్నారు. అలాగే అన్ని ప్రైవేట్ రంగంలోని వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో సహా ఉద్యోగస్తులలో ఎవరైనా అర్హత కల్గిన ఓటర్లు ఉంటే వారు సదరు పోలింగ్ రోజు వారి యొక్క ఓటు హక్కును వినియోగించుకోవటానికి వారి విధులకు ఆలస్యపు అనుమతిని లేదా షిఫ్ట్‌ల సర్దుబాటుగానీ, కొద్దిపాటి కొద్దిపాటి సమయం గైర్హాజరు కావటానికి అనుమతించాలని కలెక్టర్ ఆదేశించారు.

పల్నాడు జిల్లా వ్యాప్తంగా విద్యా సంస్థలకు సెలవు

జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.చంద్రకళ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉమ్మడి గుంటూరు కృష్ణ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం డైరక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా వ్యాప్తంగా ఉన్న విద్యా సంస్థలకు శెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు పల్నాడు జిల్లా విద్యా శాఖ అధికారిణి ఎల్ చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేరకు జిల్లా లోని అందరు ఉప విద్యా శాఖాధికారులకు, మండల విద్యాశాఖాధికారులకు, అన్ని ప్రైవేటు, ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి నేడు పోలింగ్ ఉన్నందున్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర అన్ని యాజమాన్యాల పాఠశాలలకూ సెలవు ప్రకటించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తగు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించి పాఠశాలలు నిర్వహిస్తే తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.



చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పి, తదితరులు

చోరీ కేసులో నలుగురు అరెస్టు

రూ.14.65 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఇళ్లల్లో దొంగతనాల కేసుల్లో నలుగురు నిందితులను అరెస్టు చేసి రూ.14.65 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను పాత గుంటూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పి సతీష్‌కుమార్ బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. పాత గుంటూరు వినాయక నగర్ ఆర్టీసీ కాలనీ,5వ లైన్‌కు చెందిన ఏలేశ్వరం. బాల సుదర్శన్ శర్మ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఈనెల 15న విజయవాడ వెళ్లారు. తిరిగి 17న వచ్చారు. ఇంటికి వచ్చి చూడగా తన ఇంటి గ్రిల్స్ కు వేసిన తాళం పగలగొట్టి ఉండి, బెడ్ రూమ్ లో ఉన్న లాకరు తెరవబడి ఉండి, అందులో ఉండవలసిన బంగారం, వెండి వస్తువులు దొంగిలించినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిఐ వై.సోమయ్య తన సిబ్బందితో కలిసి సాంకేతిక ఆధారాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వచ్చిన సమాచారం మేరకు ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అనేక నేరాల్లో నిందితులుగా ఉన్న లాలాపేటకు చెందిన సయ్యద్ నాగూర్ భాష, స్వర్ణభారత్‌నగర్‌కు చెందిన ఉప్పాల సురేష్‌లను అరెస్టు చేశారు. ఆభరణాలు కొనుగోలు చేసిన స్వర్ణభారతినగర్ వాసి బత్తుల గోపినాథ్‌తో పాటు తెలంగాణలోని రంగారెడ్డిజిల్లాకు చెందిన జనార్ధన్‌ను అరెస్టు చేశారు. క్రైం అదనపు ఎస్పి సుప్రజ, డిఎస్పి అబ్దుల్ అజీజ్ పర్యవేక్షణలో పాత గుంటూరు సిఐ సోమయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.





ఏసీ కాలేజి వద్దకు వచ్చిన సిబ్బంది, పోలింగ్ మెటీరియల్‌ను తీసుకెళుతూ..

పోలింగ్‌కు సర్వం సిద్ధం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కేంద్రాలకు సామగ్రిని తరలించిన సిబ్బంది - పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి నేడు జరుగుతున్న పోలింగ్ సంబంధించి పోలింగ్ మెటీరియల్‌ను సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. స్థానిక ఏసీ కాలేజిలో ఏర్పాటు చేసిన మెటీరియల్ పంపిణీ కేంద్రంలో గుంటూరు జిల్లాలోని పోలింగ్ బూత్‌లకు సంబంధించిన బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్సులు, ఇతర మెటీరియల్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల ద్వారా పిఒలు, ఏపిఒలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టార్ అధికారులు కేంద్రాలకు తరలించారు. మెటీరియల్ పంపిణీని కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్‌తేజ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలువురు పోలింగ్ సిబ్బందితో మాట్లాడి వారు తీసుకున్న మెటీరియల్ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఓటింగ్‌కు ఏర్పాట్లు పూర్తిస్థాయిలో సిద్ధం చేసినట్టు చెప్పారు. ఉమ్మడి కష్ణ, గుంటూరు జిల్లాలో 483 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, గుంటూరు జిల్లాకు సంబంధించి ఏసీ కాలేజిలో, ఇతర జిల్లాల్లో అక్కడే ఏర్పాటుచేసిన పంపిణీ కేంద్రాల ద్వారా మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకూ పోలింగ్ జరుగుతుం దన్నారు. ఓటరు స్లిప్పులు ఇప్పటికే 95 శాతం స్లిప్పులు పంపిణీ చేయటం జరిగిందన్నారు. ఓటర్లు ఓటు స్లిప్‌తో పాటు ఎన్నికల సంఘం నిర్దేశించిన 10 గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకొని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లోకి సెల్ ఫోన్‌లు, స్మార్ట్ వాచీలు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరని అన్నారు. కేవలం ప్రిసైడింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్లు మాత్రమే సమాచారం అందించ డానికి సెల్‌ఫోన్లు వినియోగిం చడానికి అను మతి ఉంద న్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత మాత్రమే మద్యం షాపులు ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారం ముగిసి నందున రాజకీయ పార్టీలు, పోటీలో ఉన్న అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే కార్యక్రమాలను, బెదిరించటం వంటి చర్యలు చేయరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్ ఎస్ కే ఖాజావలి, గుంటూరు రెవెన్యూ డివిజన్ అధికారి శ్రీనివా సులు, మునిసిపల్ రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : నేటి శాసన మండలి ఎన్నికల నేపథ్యంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పరిశీలించారు. నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డులోని ఎస్.ఎస్.ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతూ, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ కేంద్రంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి అన్ని వసతులు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న దృష్ట్యా తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ చేయనున్న సిబ్బందికి భోజన వసతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు వినియోగించే మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ చేయనున్న సామాగ్రినీ, బ్యాలెట్ బాక్స్ లను సంబంధిత రికార్డులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మురళి తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలించిన గుంటూరు జిల్లా కలెక్టర్



ఏర్పాట్లు పరిశీలించిన పల్నాడు జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి తెనాలి: ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్లు తహశీల్దార్ కె వి గోపాలకృష్ణ, కమిషనర్ బి శేషన్న వెల్లడించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన 26 పోలింగ్ కేంద్రాలలో వసతులను, ఏర్పాట్లను పోలింగ్ బూత్‌ల వారీగా వారు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ తెనాలిలో మొత్తం 20,777 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 11,699 మంది పురుషులు, 9076 మంది స్త్రీలు, ఇతరులు ఇద్దరు ఉన్నారన్నారు. ఓటర్ల కోసం పట్టణంలో 26 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారని చెప్పారు. పోలీస్ స్టేషన్లో వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలీసు సిబ్బంది పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు సహకరించాల్సిందిగా కోరారు.

నేడు ఉండవల్లిలో ఓటు వేయనున్న చంద్రబాబు కుటుంబం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం తాడేపల్లి మండలం ఉండవల్లిలో సిఎం చంద్రబాబు కుటుంబ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 9 గంటలకు నివాసం నుంచి బయలుదేరి ఉండవల్లిలోని గాదె రామయ్య సీతారావమ్మ ఎంపీయూపీ స్కూల్‌కు చేరుకుంటారు ఉదయం 9.00గంటలకు ఉండవల్లి లోచంద్రబాబు, ఆయన భార్య భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణి ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఓటేయడానికి కావాల్సిన ధ్రువపత్రాలివే..

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజ కవర్గ శాసనమండలి ఎన్నికల ఓటర్లు పోలింగ్ స్టేషన్‌లలో గుర్తింపు కోసం ఎన్నికల సంఘం నిర్దేశించిన పది రకాల ధృవపత్రాలలో ఏదైనా ఒకటి పోలింగ్ కేంద్రానికి వెంట తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఏదో ఒక ధృవపత్రం తప్పనిసరిగా ఉంటేనే ఓటు వినియోగించుకోవటానికి అవకాశం ఉంటుంది. వాటిలో ఆధార్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, భారతీయ పాస్ట్‌పోర్ట్, రాష్ట్ర/కేంద్ర ప్రభుత్వం, ప్రభుత్వ రంగ సంస్థలు, స్థానిక సంస్థలు గానీ ఇతర ప్రైవేట్ పారిశ్రామిక సంస్థల ద్వారా గాని ఉద్యోగులకు జారీ చేయబడిన సేవా గుర్తింపు కార్డు, ఎంపీలు/ ఎంఎల్‌ఏలు/ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డులు, విద్యాసంస్థలు సంబంధిత ఉపాధ్యాయులు/ గ్రాడ్యుయేట్‌ల నియోజకవర్గ ఓటర్లు ఉద్యోగంలో ఉన్న జారీ చేసిన సేవా గుర్తింపు కార్డు, యూనివర్సిటీ జారీ చేసిన డిగ్రీ/డిప్లొమా సర్టిఫికెట్ అసలు, కాంపిటెంట్ అథారిటీ జారీ చేసిన ఫిజికల్ హ్యాండిక్యాప్ సర్టిఫికేట్ అసలు, ప్రత్యేక వైకల్యం ఐడి, (యుడిఐడి)కార్డ్, ఎంఒ సామాజిక న్యాయం, సాధికారత భారత ప్రభుత్వం జారీ చేసిన కార్డులలో ఏదైనా ఒకటి తీసుకెళ్లాలి.